

టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20, కనిష్టం రూ.5.50, సరాసరి రూ.10 మేర పలికినట్లు అధికారులు తెలిపారు.



చీనీ టన్ను రూ.35 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35 వేలు పలికాయి. మార్కెట్‌కు 207 టన్నులు అమ్మకానికి వచ్చాయి.

గరిష్టం/కనిష్టం
37.8°/12.9°

జిల్లాలో సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి వాతావరణం ఉండగా మధ్యాహ్నం ఎండలు పెరిగాయి. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్ రేపు

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న మంత్రి పెద్దిరెడ్డి

అనంతపురం సప్తగిరి సర్కిల్/ ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ మద్దతుతో పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కోటా అభ్యర్థి సానిపల్లి మంగమ్మ బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. నామినేషన్ కార్యక్రమానికి పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలోని ఎంపీలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, పట్టభద్రులు ఉదయం తొమ్మిది గంటలకు అనంతపురంలోని సంగమేశ్వర ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకోవాలని ఎన్నికల పరిశీలకుడు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం 11 గంటలకు నామినేషన్ వేసేందుకు బయల్దేరనున్నట్లు వెల్లడించారు.

నిర్వాసితులకు న్యాయమైన పరిహారం



మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: ధర్మవరం–పెనుకొండ రైల్వే లైను కోసం భూములు కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం అందేలా చూస్తామని కలెక్టర్ బసంత్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ధర్మవరం, రేగాటిపల్లి గ్రామ రైతులు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ధర్మవరం–పెనుకొండ రైల్వే లైను ఏర్పాటు కోసం 2020 సెప్టెంబర్‌లో ధర్మవరం, రేగాటిపల్లి గ్రామాల్లోని 13 మంది రైతులకు సంబంధించిన 3.48 ఎకరాలు భూమిని సేకరిస్తున్నట్లు తెలిపారు. భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీఓ తిప్పేనాయక్, తహసీల్దార్ యోగేశ్వరి దేవి, రైల్వే అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎలీసా, రైతులు పాల్గొన్నారు.

కాస్మోటిక్, డైట్ చార్జీల పెంపు

- 14వేల మంది విద్యార్థులకు లబ్ధి



అనంతపురం రూరల్: ప్రభుత్వ వసతిగృహాల విద్యార్థులకు జగన్ సర్కార్ శుభవార్త చెప్పింది. నాణ్యమైన భోజనం అందించడంతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశంతో డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 53 బీసీ వసతి గృహాల పరిధిలో 6,500 మంది, 11 ఎస్టీ హాస్టళ్లలో 3,040 మంది, 58 ఎస్సీ హాస్టళ్లలో 4,500 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. గతంలో మూడో తరగతి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు డైట్ చార్జీలు రూ.1,000 ఉండగా తాజాగా రూ.1,150కు పెరిగింది. ఐదు నుంచి పదో తరగతి విద్యార్థులకు రూ.1,250 నుంచి 1,450కు, ఇంటర్ నుంచి ఆపైన చదివే విద్యార్థులకు రూ.1,400 నుంచి రూ.1,600 పెరిగాయి. కాస్మోటిక్ చార్జీలు మూడు నుంచి ఆరో తరగతి బాలురకు రూ.110 నుంచి రూ.160, బాలికలకు రూ.110 నుంచి రూ.130, ఏడు నుంచి పదో తరగతి చదువుతున్న బాలురకు రూ.125 నుంచి రూ.150, బాలికలకు రూ.160 నుంచి రూ 200, ఇంటర్ ఆపైన విద్యార్థులకు రూ.125 నుంచి రూ.200, విద్యార్థినులకు రూ.160 నుంచి రూ.200కు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



మాటిస్తే తప్పేది లేదన్న విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి నిరూపించారు. బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్లాసెస్ కాదు.. బ్యాక్ బోన్ (వెన్నెముక) అని చేతల్లో చూపించారు. తాజాగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ సీటును వాల్మీకి (బోయ) సామాజిక వర్గానికి చెందిన సానిపల్లి మంగమ్మకు కేటాయించడం ఇందుకు నిదర్శనం. టీడీపీ హయాంలో ఆ పార్టీ కాంట్రాక్టర్లకు, పారిశ్రామిక వేత్తలకు మాత్రమే రాజ్యసభ, శాసనమండలి స్థానాలు దక్కేవి. బీసీలకు పదవులు అందని ద్రాక్షలాగా ఉండేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీసీలకు పెద్దపీట వేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో బీసీలను రాజకీయంగా, పదవుల పరంగా అగ్రభాగంలో నిలబెట్టారు. – సాక్షి ప్రతినిధి, అనంతపురం

బీసీలకు పెద్దపీట

- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సానిపల్లి మంగమ్మ ఎంపికపై హర్షాతిరేకాలు
- బోయ సామాజిక వర్గానికి విశేష ప్రాధాన్యం
- ఉమ్మడి జిల్లాలో కురుబలు, ఇతర వర్గాలకూ పెద్దపీట
- సీఎం జగన్ నిర్ణయాలను స్వాగతిస్తున్న ప్రజలు



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గిరిజమ్మ, పైలా నరసింహయ్య తదితరులు

మాజీ ఎంపీ సానిపల్లి గంగాధర్ సతీమణి మంగమ్మను వైఎస్సార్‌సీపీ తరఫున స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. బోయ సామాజిక వర్గానికి చెందిన ఈమెను మండలికి పంపించాలన్న ముఖ్యమంత్రి నిర్ణయాన్ని ఉమ్మడి జిల్లాలోని బీసీ వర్గాలు స్వాగతిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే బోయ సామాజిక వర్గానికే చెందిన తలారి రంగయ్యకు అనంతపురం ఎంపీ సీటిచ్చి గెలిపించారు. గిరిజమ్మను జెడ్పీ చైర్‌పర్సన్ చేశారు. లిఖితకు ఏడీసీసీబీ చైర్‌పర్సన్ పదవి ఇచ్చారు. తాజాగా మంగమ్మకు ఎమ్మెల్సీ సీటు కేటాయించడం విశేషం.

బోయ, కురుబలకు సముచిత స్థానం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో బోయ, కురుబ సామాజిక వర్గాల జనాభా ఎక్కువగా ఉంది. ఇందుకు అనుగుణంగానే వారికి వైఎస్ జగన్ రాజకీయంగా పెద్దపీట వేస్తున్నారు. ఇందులో భాగంగా 2019 ఎన్నికల్లో కురుబల్లో గోరంట్ల మాధవ్‌కు హిందూపురం ఎంపీ సీటు, శంకర్‌నారాయణ (పెనుకొండ), ఉషశ్రీ (కళ్యాణదుర్గం)లకు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చి గెలిపించారు. కురుబ సామాజిక వర్గం వారికే రెండు సార్లు మంత్రి పదవులు ఇవ్వడం ద్వారా వారిని గౌరవించారు. ఇక అనంతపురం ఎంపీ సీటు గతంలో ఎక్కువగా ఓసీ కేటగిరీకి కేటాయించేవారు. అలాంటి స్థానాన్ని కూడా గత ఎన్నికల్లో బీసీకి కేటాయించి గెలిపించిన ఘనత జగన్‌దేనన్న చర్చ జనంలో జోరుగా సాగుతోంది. నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలంటే కేవలం ఓట్లు, నోట్లు చూసే టీడీపీకి ఇది పెద్ద చెంపపెట్టు అని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మైనార్టీలకు కూడా జగన్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇక్బాల్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంతో పాటు అనంతపురం మేయర్ పదవిని వసీంకు కట్టబెట్టిన విషయం తెలిసిందే. ఏదిఏమైనా వైఎస్సార్‌సీపీతోనే సామాజిక న్యాయం సాధ్యమని సీఎం జగన్ మరోసారి నిరూపించారు.

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం

అనంతపురం సప్తగిరి సర్కిల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సామాజిక న్యాయం చేకూరుతోందని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అన్నారు. రాష్ట్రంలోని 18 స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు గాను 12 స్థానాలను బీసీ వర్గాలకు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్యతో కలసి ఆమె క్షీరాభిషేకం చేసి, మాట్లాడారు. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు సామాజిక న్యాయం పేరుతో బీసీలను వంచనకు గురి చేస్తున్నాయన్నారు. ఇందుకు భిన్నంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల అభ్యున్నతికి పెద్ద పీట వేసి సామాజిక న్యాయాన్ని పాటిస్తున్నారని కొనియాడారు. ఇందులోనూ మహిళాభ్యున్నతికి ప్రాధాన్యతనివ్వడం మరిచిపోలేదన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ వసీం సలీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత, బీసీ కమిషన్ రాష్ట్ర సభ్యుడు కిష్టప్ప, వ్యవసాయ మిషన్ సభ్యుడు బోయ రాజారాం, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు చింత సోమశేఖరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చామలూరు రాజగోపాల్, శ్రీదేవి, పెన్నోబులేసు, మునీరాబేగం, రాధాయాదవ్, రిలాక్స్ నాగరాజు, గోగుల పుల్లయ్య, చింతకుంట మధు, అనిల్‌కుమార్ గౌడ్, వెన్నపూస రామచంద్రారెడ్డి, కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, రహంతుల్లా, శ్రీనివాసులు, బాబాఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మంగమ్మకు ఎమ్మెల్సీ!

- స్థానిక సంస్థల కోటాలో అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిన వైఎస్సార్ సీపీ



సానిపల్లి మంగమ్మ

పెనుకొండ: హిందూపురం పార్లమెంట్ మాజీ సభ్యులు దివంగత సానిపల్లి గంగాధర్ సతీమణి సానిపల్లి మంగమ్మకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ స్థానం కేటాయించింది. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించింది. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆమె పేరు ప్రకటించారు. దీంతో మంగమ్మ కుటుంబీకులు, సన్నిహితులు, వాల్మీకి కులస్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు.

మంగమ్మ కుటుంబ నేపథ్యం..

కళ్యాణదుర్గం మండలం శీబావి గ్రామానికి చెందిన మంగమ్మది సాధారణ మధ్య తరగతి కుటుంబం. 1979లో పెనుకొండ మండలం మునిమడుగు గ్రామానికి చెందిన సానిపల్లి గంగాధర్‌తో వివాహమైంది. గంగాధర్ 1987లో గుట్టూరు సింగిల్‌విండో అధ్యక్షులుగా పని చేశారు. అప్పటికే యంగ్ ఇండియా సంస్థలో క్రియాశీలకంగా పనిచేసిన గంగాధర్ రాజకీయ చైతన్యాన్ని ఆ సంస్థ అధ్యక్షుడు బేడీ గుర్తించారు. రాజీవ్‌గాంధీతో మాట్లాడి 1989లో హిందూపురం పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఇప్పించారు. అప్పట్లో ఆయన ఎంపీగా గెలిచారు. మళ్లీ 1991 నుంచి 1996 ప్రారంభం వరకు ఎంపీగా కొనసాగారు. 1996లో రామచంద్రారెడ్డి చేతిలో ఓటమి చవి చూశారు. 1998లో అదే రామచంద్రారెడ్డిపై గెలిచారు. ఆతర్వాత 1999లో వచ్చిన ఎన్నికల్లో బీకే పార్థసారథి చేతిలో ఓడిపోయారు. అనంతరం గంగాధర్ అనారోగ్యంతో మరణించారు. ఆయన సతీమణి సానిపల్లి మంగమ్మ తమకు రాజకీయంగా అండగా నిలిచిన వైఎస్ రాజశేఖరరెడ్డి వెంట నడిచారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీలో చేరి పెనుకొండ నియోజకవర్గ సమన్వయ కర్తగా, సీఈసీ సభ్యులుగా వైఎస్సార్ సీపీ అభివృద్ధికి పాటుపడ్డారు. నమ్ముకుని వెంట నడిచిందుకు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏకంగా ఎమ్మెల్సీ సీటు కేటాయించడంతో మంగమ్మ కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

స్వగ్రామంలో సంబరాలు

కళ్యాణదుర్గం: మంగమ్మను స్థానిక సంస్థల కోటాలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించగానే ఆమె స్వగ్రామం కళ్యాణదుర్గం మండలం శీబావిలో సంబరాలు అంబరాన్నంటాయి. కుటుంబ సభ్యులు రామచంద్ర, మల్లరాయుడు, శివాజీ, అశోక్, సర్వోత్తమలతో పాటు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గోళ్ల మోహన్‌రెడ్డి, కో ఆప్షన్ అబ్దుల్ రెహమాన్, తిప్పేష్, రామాంజి, వడ్డే రామాంజి, నాగేంద్ర, తిమ్మప్ప, పోతేష్, ప్రహ్లాద తదితరులు అనంతపురం ప్రధాన రహదారిపై బాణాసంచా పేల్చారు. స్వీట్లు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. తమ ఆడపడుచుకు సముచిత స్థానం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బీ–ఫారం అందుకునేందుకు తన సోదరి మంగమ్మతో కలిసి అశ్వర్థ, స్థానికులు విజయవాడకు బయలుదేరి వెళ్లారు.



బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకుంటున్న శీబావి గ్రామస్తులు

వైభవం.. అగ్నిగుండ మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో సిద్ధేశ్వరస్వామి



అగ్నిగుండంలోకి ధూపం వేస్తున్న భక్తులు

- కమనీయంగా సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు
- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు
- కిటకిటలాడిన హేమావతి క్షేత్రం

హేమావతి (అమరాపురం): హేమావతి సిద్ధేశ్వర స్వామి అగ్నిగుండ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అర్చకులు స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని వివిధ పుష్పాలతో అలంకరించి మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ఆవరణ కుడివైపున ఉన్న అగ్నిగుండం వద్దకు తీసుకువచ్చి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులతో కలిసి ఈఓ నాగేంద్రప్రసాద్, ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ దూపం వేసి అగ్నిగుండ మహోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం భక్తులు అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణలు చేసి వేరుశనగ, చింతపండు, చింతకొమ్మలు, కందులు, దూపం, కొబ్బరి, నవధాన్యలను అగ్నిగుండంలో వేశారు. అంతకుముందు ఆలయంలో స్వామివారికి ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి స్వామి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయనకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి సన్మానం చేశారు.

పోటెత్తిన భక్త జనం..

సిద్ధేశ్వరస్వామి అగ్నిగుండ మహోత్సవంలో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రంలోని హిరియూర్, పావగడ, చెళ్లకెర, తుమకూరు, బెంగళూరు, మైసూర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని పూజలు చేయడంతో పాటు కాలభైరవేశ్వరస్వామి, దొడ్డేశ్వరస్వామి, మల్లేశ్వర స్వామి, విరుపాక్షేశ్వరస్వామి, నవకోటమ్మదేవి, హంపణ్ణ దేవాలయాల్లో స్వామివార్లకు పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో దాదాపు 50 వేల మంది పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ సురేష్‌కుమార్, ఎస్‌ఐ వెంటేశ్వర్లు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు.

పురోగతి కనిపించాలి

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- కలెక్టర్ బసంత్‌కుమార్



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో రోజురోజుకూ పురోగతి కనిపించాలని కలెక్టర్ బసంత్‌కుమార్ అన్నారు. ముఖ్యంగా వైఎస్సార్ జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు, ఇతర ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలపై దృష్టి సారించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వారు ఎవరైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సోమవారం ఆయన కలెక్టరేట్ నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సామూహిక గృహ ప్రవేశాలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల ఇళ్లు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించిందని, ఇందులో జిల్లాలోని జగనన్న లేఅవుట్లలో 10,600 ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యం ఉందన్నారు. అయితే ఇప్పటి వరకూ 4,150 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని, మరో 6,450 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఇందులో బేస్‌మెంట్ స్థాయిలో 2,686, ఆర్సీ స్థాయిలో 1,654, చివరి దశలో మరో 2,110 ఇళ్లు ఉన్నాయన్నారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఇళ్లన్నీ సకాలంలో పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయి అధికారుల్లో అవగాహన లోపం ఉందని, దానిని సరిదిద్దుకోవాలని సూచించారు. చాలా విషయాలకు సంబంధించి ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వద్ద పూర్తి సమాచారం ఉండటం లేదని, వెంటనే సమగ్ర వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

వివరణ ఇవ్వండి..

'నాడు–నేడు' కింద పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ తదితర ప్రాధాన్యత భవనాలకు సంబంధించి చాలా చోట్ల పనులు ప్రారంభం కాలేదని కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. దీనిపై సంజాయిషీ ఇవ్వాలని మడకశిర, పుట్టపర్తి, హిందూపురం ,రాప్తాడు పంచాయతీరాజ్ డీఈలను ఆదేశించారు. గ్రామ సచివాలయాలకు సంబంధించి 9 భవనాలు, 34 రైతు భరోసా కేంద్రాలు, 36 వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాల పనులు ప్రారంభంకాలేదన్నారు. ఆయా భవనాల నిర్మాణాలకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే వేరే ఏజెన్సీలకు ఇచ్చి పూర్తి చేయించాలన్నారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలలో భాగంగా కేటాయించిన పురోగతి చూపించాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, పీఆర్ ఈఈ మురళీ మోహన్, డీఈలు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పట్టా పేరుతో 'పచ్చ'మోసం!

వారంతా భవన నిర్మాణ కార్మికులు. రెక్కలు ముక్కలు చేసుకుని వచ్చిన కొద్దిపాటి సొమ్ముతోనే కుటుంబాలను పోషించుకునేవారు. వారి సంఘంలో దూరిన 'పచ్చ'నేత మేతకు సిద్ధమయ్యాడు. భవన నిర్మాణ కార్మికుల కోసం సేకరించిన భూమిని కబ్జా చేశాడు. అమాయకులైన కార్మికులను బెదిరిస్తూ పబ్బం గడుపుకుంటున్నాడు.

- భవన కార్మికులకు టోపీ పెట్టిన సంఘం మాజీ అధ్యక్షుడు
- ఇంటి పట్టాల కోసమంటూ వసూళ్లు
- 3.15 ఎకరాలు కేటాయించినా సెంటు భూమికి పట్టా ఇవ్వని వైనం

కదిరి టౌన్ : పట్టణానికి చెందిన అహమ్మద్‌అలీ టీడీపీ నాయకుడు. గతంలో టీడీపీ పట్టణాధ్యక్షుడిగా కూడా పనిచేశాడు. ఆ సమయంలోనే భవన నిర్మాణ కార్మికులను తన మాటలతో మాయ చేశాడు. సంఘం అధ్యక్షుడిగా ఉంటూ కార్మికులను నిండా ముంచేశాడు.

3.15 ఎకరాలు కొనుగోలు..

పట్టణంలోని భవన నిర్మాణ కార్మికులకు పట్టాలిప్పిస్తానని సంఘం అధ్యక్షుడిగా ఉన్న అహమ్మద్ అలీ ఒక్కొక్కరి నుంచి రూ.2,250 చొప్పున 800 మందితో దాదాపు రూ.18 లక్షలపైనే వసూలు చేశాడు. 2018 అక్టోబర్‌లో పట్టణంలోని గట్ల సమీపంలోని సర్వేనంబర్ 1713–2వ లెటరులోని 3.15 ఎకరాలను సంఘం కోసం తీసుకున్నారు. ఇందులో ఎకరాను అహమ్మద్ అలీ తనపేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. మిగతా 2.15 ఎకరాలనూ తన అధీనంలో ఉంచుకున్నాడు. కార్మికులు ఎప్పుడు పట్టాల గురించి ప్రస్తావించినా ఐడెంటిటీ కార్డులు ఇచ్చేసి చేతులు దులుపుకునే వాడు. గట్టిగా నిలదీస్తే రాజకీయంగా తన పలుకుబడి ఉపయోగించి వారి నోళ్లు మూయించేవాడు. కొందరికి పట్టాలిచ్చినా స్థలాలు చూపలేదు. దీంతో అహమ్మద్ అలీపై భవన నిర్మాణ కార్మికులు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా.. పట్టించుకునే నాథుడే కరువయ్యారు. తమకు న్యాయం చేయాలని కోరితే... పోలీసులు కూడా ఆ నాయకుడికే వత్తాసు పలుకుతూ వచ్చారని కార్మికులు చెబుతున్నారు.



భవన నిర్మాణ కార్మికుల కోసం సేకరించిన భూమి

బిల్డింగ్ నిర్మిస్తే... డబ్బులివ్వాల్సిందే!!

తాను టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో అహమ్మద్ అలీ చేసినా వసూళ్ల అన్నీ ఇన్నీ కావు. మున్సిపల్ పరిధిలో ఎవరైనా బిల్డింగ్ నిర్మిస్తున్నట్లు తెలిస్తే... అక్కడ పని చేసే కార్మికులు ఆయనకు చదరపు అడుగుకు రూ.20 చొప్పున ముట్టచెప్పాలి. ట్రాక్టర్ ఇసుకు తోలుకోవాలంటే రూ.100 చొప్పున చెల్లించాలి. లేకపోతే పనులు జరగకుండా చేసేవాడు. ఆ డబ్బుకు లెక్కా, పత్రం ఏవీ ఉండేవి కావు. దీంతో విసిగిపోయిన కార్మికులంతా ఏకమై అహమ్మద్ అలీని సంఘం అధ్యక్షుడిగా తొలగించారు. అయినా ఆయన నేటికీ సంఘానికి సంబంధించిన రికార్డులు అప్పగించలేదు.

నకిలీ ఐడెంటిటీ కార్డులు



గతంలో మా సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన అహమ్మద్ అలీ మాకు నకిలీ ఐడెంటిటీ కార్డులు, నకిలీ పట్టాలు ఇచ్చి మోసం చేశాడు. సభ్యత్వం కింద డబ్బులు కట్టించుకున్నాడు. పట్టాలిస్తానని చెప్పినా నేటికీ స్థలం మాత్రం చూపలేదు. – టోపీ వలి

మోసం చేశాడు



నేను కొన్నేళ్లుగా భవన కార్మిక సంఘంలో సభ్యుడిగా ఉన్నా. అద్దె ఇళ్లలో అవస్థలు పడలేక పట్టాలిస్తామంటే నమ్మి డబ్బులిచ్చాం. అయినా మాకు పట్టాలివ్వకుండా అహమ్మద్ అలీ మోసం చేశాడు. ప్రభుత్వ పథకాలు కూడా మాకు అందకుండా చేశాడు. – ఎస్. షామీర్

క్లుప్తంగా

'పోలీస్ స్పందన'కు 33 అర్జీలు



సమస్య తీవ్రత తెలుసుకుంటున్న ఏఎస్పీ

పుట్టపర్తి అర్బన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'స్పందన' కార్యక్రమానికి 33 వినతులు అందాయి. అర్జీలను ఏఎస్పీ రామకృష్ణప్రసాద్ స్వయంగా స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్టపరిధిలో ఉన్నవాటికి తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్ యత్నం కేసులో ముగ్గురికి రిమాండ్

యాడికి: యువతి కిడ్నాప్ యత్నం కేసులో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలను ఎస్‌ఐ గురుప్రసాద రెడ్డి వెల్లడించారు. యాడికి మండలం పిన్నేపల్లికి చెందిన యువతిని పెళ్లి చేసుకోవాలంటూ అదే గ్రామానికి చెందిన భాస్కరరెడ్డి రెండేళ్లుగా వెంటపడేవాడు. ఈ క్రమంలో ఈ నెల 17న ఇంట్లో ఒంటరిగా ఉన్న యువతిని తన స్నేహితులు చంద్ర, చిలక వెంకట్రాముడు, వన్నూరుస్వామి, రంగనాథ్‌తో కలసి డమ్మీ పిస్తోలుతో బెదిరించి కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో స్థానికులు అడ్డగించి, పట్టుకోవడంతో తప్పించుకుని పారిపోయారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం కోన రహదారిలో భాస్కరరెడ్డి, వెంకట్రాముడు, వన్నూరుస్వామి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి డమ్మీ పిస్తోలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చూపి న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కాగా, ఇదే కేసులో పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏర్పాట్లు షురూ

- 'స్థానిక' ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జెడ్పీలో ప్రత్యేక విభాగం ఏర్పాటు
- ఉమ్మడి జిల్లా జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల ఓటర్ల జాబితా పరిశీలనలో అధికారులు తలమునకలు



పార్టీల వారీగా ఎంపీటీసీ సభ్యులు ఇలా..	
పార్టీ	సభ్యుల సంఖ్య
వైఎస్సార్‌సీపీ	769
టీడీపీ	54
కాంగ్రెస్	01
బీజేపీ	01
సీపీఐ	01
సీపీఎం	01
జనసేన	01
స్వతంత్రులు	13
మొత్తం	841

జెడ్పీటీసీ సభ్యుల సంఖ్య	63
ఎంపీటీసీ సభ్యుల సంఖ్య	841
రాజీనామా చేసిన ఎంపీటీసీలు	01
మరణించిన ఎంపీటీసీ సభ్యులు	03

అనంతపురం సిటీ: శాసన మండలి (ఎమ్మెల్సీ) స్థానిక సంస్థల విభాగానికి సంబంధించి ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో జిల్లాలో అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి జెడ్పీ కార్యాలయంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు. జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా పరిశీలనలో అధికారులు తలమునకలయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంత మంది జెడ్పీటీసీ, ఎంపీటీసి సభ్యులున్నారనే అంశంపై ఆరా తీస్తున్నారు.

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఓట్లే కీలకం..

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఓట్లే కీలకం. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 63 మంది జెడ్పీటీసీ సభ్యులుండగా, వీరిలో 61 మంది వైఎస్సార్‌సీపీకి చెందిన వారే కావడం గమనార్హం. అగళి నుంచి టీడీపీ అభ్యర్థి, రొళ్ల మండలం నుంచి స్వతంత్ర అభ్యర్థి జెడ్పీటీసీలుగా గెలిచారు. అలాగే 63 మండలాల నుంచి మొత్తం 841 మంది ఎంపీటీసీ సభ్యులుండగా వీరిలో ప్రస్తుతం 837 మంది మాత్రమే ఉన్నారు. మిగిలిన వారిలో ఆత్మకూరు-1 ఎంపీటీసీ సభ్యురాలు లీలావతి తన పదవికి రాజీనామా చేశారు. గుమ్మఘట్ట మండలం భూపసముద్రం ఎంపీటీసీ సభ్యుడు గొల్ల గోవిందప్ప, విడపనకల్లు-1 నుంచి గెలుపొందిన బెస్త సుంకన్న, రాయదుర్గం మండలం కెంచనపల్లి ఎంపీటీసీ సభ్యుడు సత్యనారాయణ నాయుడు (ముగ్గురూ వైఎస్సార్‌సీపీ సభ్యులే) మరణించారు. దీంతో ఆయా స్థానాలు ఖాళీగా ఉండిపోయాయి.

డివిజన్ల వారీగా ఓటర్ల జాబితా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏడు రెవెన్యూ డివిజన్ల వారీగా ఓటర్ల జాబితాను అధికారులు సిద్ధం చేస్తున్నారు. జాబితాలో అభ్యర్థుల పేర్లు, ఇతర వివరాలు సమగ్రంగా ఉన్నది...లేనిది, అక్షర దోషాలు తదితర అంశాలను పరిశీలిస్తున్నారు. మూడ్రోజులుగా రేయింబవళ్లూ కొనసాగుతున్న ఈ ప్రక్రియ ఒకట్రెండు రోజుల్లో ఓ కొలిక్కి వచ్చే అవకాశముంది.

• వైభవంగా.. రథోత్సవం



బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడలో సోమవారం సాయంత్రం ఎణ్ణెరంగనాథేశ్వరస్వామి (యన్నప్ప తాత)రథోత్సవాన్ని వైభంగా నిర్వహించారు. 40 అడుగుల ఎత్తున్న రథంపై స్వామిని అధిష్ఠింపజేసి, గోవింద నామస్మరణతో భక్తులు లాగారు. ఈ సందర్భంగా యువకులకు కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు జెడ్పీటీసీ సభ్యుడు లోకేష్, ఎస్‌ఐ శివ బహుతులు ప్రదానం చేశారు.

ఆచార్య రవీంద్రనాథ్ కన్నుమూత



ఆచార్య ఎల్‌కే రవీంద్రనాథ్ (ఫైల్)

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని కెమిస్ట్రీ విభాగం విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ ఎల్‌కే రవీంద్రనాథ్ సోమవారం అనంతపురంలోని ఆయన నివాసంలో కన్నుమూశారు. 30 ఏళ్ల పాటు పాటు ఆయన ఎస్కేయూ కెమిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ , అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్‌గా అంకితభావంతో పనిచేశారు. బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గాను, కెమిస్ట్రీ విభాగాధిపతిగాను పనిచేశారు. ఆయన మృతి పట్ల మాజీ ప్రొఫెసర్లు డాక్టర్ పి.రవీంద్రారెడ్డి, డాక్టర్ శ్రీరాములు, ప్రస్తుత ప్రొఫెసర్ డాక్టర్ కె.సుధాకరబాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.అనిత ఓ ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు.

లేపాక్షిలో వైభవంగా చండీ హోమం



దుర్గాదేవికి హారతినిస్తున్న అర్చకులు

లేపాక్షి: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని లేపాక్షి వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం మధ్యాహ్నం చండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. కార్యక్రమాన్ని ఈఓ నరసింహమూర్తి, రుత్వికులు సునీల్‌శర్మ తదితరులు పర్యవేక్షించారు. అనంతరం ఆదిదంపతులను సింహ వాహనంపై అధిష్ఠింపజేసి ఊరేగించారు. ఉత్సవానికి ఉభయదారులుగా ముద్దిరెడ్డిపల్లికి చెందిన పామిశెట్టి శేఖర్, నాగభూషణరెడ్డి దంపతులు వ్యవహరించారు.

మామిడి తోటకు నిప్పు



కదిరి అర్బన్: గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో కదిరి మండలం సున్నపుగుట్ట తండాకు చెందిన రైతు బాషా మామిడితోట సోమవారం దగ్ధమైంది. మొత్తం నాలుగు ఎకరాల్లోని మామిడి తోటను చుట్టుముట్టిన మంటలను అదుపు చేసేందుకు రైతులు చేసిన ప్రయత్రాలు విఫలమయ్యాయి. దాదాపు రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

స్కూలు వ్యాన్ బోల్తా



కాలువలోకి బోల్తా పడిన స్కూలు వ్యాన్

కనగానపల్లి: మండలంలోని బద్దలాపురం సమీపంలో తగరకుంటలోని ఓ ప్రైవేట్ స్కూల్ వ్యాన్ సోమవారం సాయంత్రం కాలువలో బోల్తాపడింది. ప్రమాద సమయంలో అందులో ప్రయాణిస్తున్న 15 మంది విద్యార్థులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. నరసంపల్లికి చెందిన విద్యార్థి అమరనాథ్ కుడిచేయి విరిగింది. సమాచారం అందుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు అక్కడకు చేరుకుని పిల్లలను తగరకుంట పీహెచ్‌సీకి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జీడీఎస్ ఉద్యోగుల సహాయ నిరాకరణ

అనంతపురం సిటీ: తపాలా శాఖలో పని చేస్తున్న జీడీఎస్ ఉద్యోగులు సోమవారం నుంచి సహాయ నిరాకరణ ఉద్యమాన్ని చేపట్టారు. టార్గెట్లు విధించి వేధింపులకు గురి చేయడాన్ని నిరసిస్తూ వారు నిరసనకు దిగిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకూ వివిధ రూపాల్లో తమ నిరసనలు తెలిపినా ఉన్నతాధికారులు స్పందించకపోవడంతో సహాయ నిరాకరణ ఉద్యమాన్ని చేపట్టినట్లు ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్(ఏఐజీడీఎస్‌యూ), నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్స్(ఎన్‌యూజీడీఎస్) ప్రతినిధులు తెలిపారు. సోమవారం నుంచి తాము విధులకు హాజరైనా, ఎలాంటి కొత్త డిపాజిట్లు, పాలసీలు తీసుకోబోమని యూనియన్ ప్రతినిధి కృష్ణయ్య యాదవ్ తెలిపారు. అనంతపురం, హిందూపురం డివిజన్లలోని అన్ని తపాలా కార్యాలయాల్లో పని చేసే సిబ్బంది సహాయ నిరాకరణలో భాగస్వాములయ్యారని పేర్కొన్నారు.

వీడిన జంట హత్యల మిస్టరీ



అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నర్సింగప్ప

గుంతకల్లు: పట్టణంలో సంచలనం సృష్టించిన జంట హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఆస్తి పంపకాల నేపథ్యంలోనే భూస్వామి జీపీ హేమకోటిరెడ్డి, అడ్డుకోబోయిన ఆయన డ్రైవర్ హత్యకు గురైనట్లు విచారణలో తేలింది. కేసులో ప్రధాన నిందితులైన నలుగురితోపాటు హత్యకు సహకరించిన మరో ఐదుగురిని అరెస్టు చేశారు. వివరాలను సీఐలు గణేష్, రామసుబ్బయ్యతో కలిసి డీఎస్పీ నర్సింగప్ప వెల్లడించారు. ఈ నెల 14న భూస్వామి జీపీ హేమకోటిరెడ్డి, ఆయన డ్రైవర్ షేక్షావలి హత్యకు గురయ్యారు. ఈ కేసులో నిందితులైన తొమ్మిది మంది సోమవారం ఉదయం గుత్తి సమీపంలోని ఎన్‌హెచ్-44లో ఉన్న బాట సుంకులమ్మ గుడి వద్ద ఉన్నట్లు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రెండు కార్లు, ఒక పల్సర్ ద్విచక్ర వాహనం, హత్యకు ఉపయోగించిన పిడి బాకు, కాల్చి వేసిన సీసీ టీవీ ఫుటేజీల హార్డ్ డిస్క్ ముక్కలను స్వాధీనం చేసుకున్నారు.

ఆస్తి పంపకాల వివాదమే..

పాతగుంతకల్లుకు చెందిన జీపీ కేశవరెడ్డి, మంతకల్లురెడ్డి అన్నదమ్ములు. కేశవరెడ్డికి ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డితోపాటు మాలతి సంతానం కాగా.. మంతకల్లురెడ్డికి భాస్కర్‌రెడ్డి, హేమకోటిరెడ్డి, నీలకంఠరెడ్డి సంతానం. ఈ కుటుంబాల మధ్య మూడు దశాబ్దాలుగా ఆస్తి వివాదాల్లో అనేక క్రిమినల్ కేసులతోపాటు కోర్టులో కేసులు కూడా నడుస్తూ ఉన్నాయి. వీరిలో నీలకంఠరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి చనిపోయారు. ఇక మిగిలిన హేమకోటిరెడ్డి, సుధాకర్‌రెడ్డి మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. సుధాకర్‌రెడ్డి గుంతకల్లు వదిలి తెలంగాణలోని మక్తల్ గ్రామానికి మకాం మార్చాడు. అక్కడే హోటల్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. హేమకోటిరెడ్డిని ఎలాగైనా చంపాలని వైఎస్సార్ జిల్లా రమణపల్లికి చెందిన చిట్టిబాబుకు ఒకసారి, మరోసారి పాతగుంతకల్లుకు చెందిన బోయ ప్రసాద్‌కు, ఇంకోసారి గుంతకల్లులోని ఆలూరు రోడ్డుకు చెందిన మోసిన్, అనంతపురానికి చెందిన హనీఫ్, తాడిపత్రి రావివెంకటాంపల్లికి చెందిన కృష్ణయ్యకు సుపారీ ఇచ్చి.. ఫెయిలయ్యాడు. గత జనవరి 19న సుధాకర్‌రెడ్డి చనిపోయాడు. దీంతో సుధాకర్‌రెడ్డి భార్య సుగుణ, కొడుకు భరతసింహారెడ్డి హేమకోటిరెడ్డి హత్యకు పథకం పన్నారుఘిందు కోసం 15 రోజుల పాటు పక్కా రెక్కీ నిర్వహించారు. భరత్‌సింహారెడ్డితోపాటు ఈయన తల్లి సుగుణమ్మ, మేనమామలు దేవేందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వారి రెస్టారెంట్‌లో పనిచేసే దీపం సుబ్బరాయుడు, ఈడిగ ప్రకాష్‌గౌడ్‌తో హత్యకు ప్రణాళిక రచించారు. హేమకోటిరెడ్డి ఇంటి సమీపంలోనే తిరుగుతూ ఆయన కదలికలపై నిఘా పెట్టారు. వీరికి మక్తల్‌కు చెందిన చెండేపల్లి దేవేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి చెల్లెలు మాలతి (దూదేకుల మాబు (లేట్)ను ప్రేమ వివాహం చేసుకుంది), ఈమె కుమారుడు అబ్దుల్లాతోపాటు మల్లేనుపల్లికి చెందిన వడుగూరు గోవిందప్ప సహకరించారు. ఈ నెల 14న హేమకోటిరెడ్డి ఇంటి బయట భరతసింహారెడ్డి, సుబ్బరాయుడు, ప్రకాష్‌గౌడ్‌లు మాట్లాడుకున్నారు. తర్వాత ఇంట్లోకి భరత్‌సింహారెడ్డి, సుబ్బరాయుడు వెళ్లారు. ప్రకాష్‌గౌడ్ బయటే ఉండి పరిస్థితులు గమనిస్తున్నాడు. ఇంట్లోకి వెళ్లిన భరతసింహారెడ్డి తాను కేశప్ప మనవడినని, ఆస్తి పత్రాలపై సంతకాలు చేయాలంటూ చెప్పడంతో హేమకోటిరెడ్డి బెదిరించాడు. మొండికేసిన హేమకోటిరెడ్డిని పిడి బాకుతో పొడిచాడు. అదే సమయంలో అడ్డుకోవడానికి వచ్చిన డ్రైవర్ షేక్షావలిని కూడా చంపి పారిపోయారు. ఈ హత్యలతో సంబంధం ఉన్న ఈ తొమ్మిది మందితోపాటు గతంలో సుధాకర్‌రెడ్డి సుపారీలు ఇచ్చిన మరో ఆరుగురిపై (పరారీలో ఉన్నారు) కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులోని నిందితుల్లో తొమ్మిది మందిని సోమవారం ఉదయం గుత్తి సమీపంలోని ఎన్‌హెచ్-44లో అరెస్ట్ చేశారు. వీరిని మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన టూటౌన్ సీఐ గణేష్, వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య, ఎస్‌ఐ తిరుపాల్, ఏఎస్‌ఐలు శాంతిరాముడు, పద్మావతి, హెడ్ కానిస్టేబుళ్లు శివప్రసాద్, శంకరయ్య, వెంకటేష్, బాబాముని్వర్ వై.ఓబుళపతి, కానిస్టేబుళ్లు చిరంజీవి, ఎర్రిస్వామి, బాబు, మురళిలను డీఎస్పీ అభినందించారు.

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

రొళ్ల: తప్పిపోయిన బాలికను సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు పోలీసులు చేర్చారు. వివరాలు.. స్థానిక బస్టాండ్ ఆవరణలో సోమవారం మధ్యాహ్నం గుక్కపట్టి ఏడుస్తున్న ఏడేళ్ల వయసున్న బాలికను స్థానికులు వివరాలు ఆరా తీశారు. తన పేరు హర్షిణి అని, తండ్రి పేరు ప్రకాష్, తల్లి పేరు ఇందిరమ్మగా తెలిపింది. ఊరు పేరు చెప్పకపోవడంతో బాలికను పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. దీంతో బాలిక వివరాలను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడంతో రెండు గంటల వ్యవధిలోనే కుటుంబసభ్యులు స్పందించి పోలీసులతో సంప్రదించారు. కర్ణాటకలోని హొసదుర్గకు హర్షిణి... తన తల్లిదండ్రులతో కలసి అగ్రహారం గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చింది. సోమవారం ఆడుకుంటూ రొళ్ల బస్టాండ్‌కు చేరుకున్న ఆమె తిరిగి ఇంటికి ఎలా వెళ్లాలో తెలియక ఏడుస్తూ ఉండిపోయింది. దీంతో హర్షిణి తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు గ్రామస్తుల సమక్షంలో పోలీసులు అప్పగించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త రమాదేవి, ఎస్‌ఐ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

• ఇంటి ముంగిటే పాము పుట్ట!



హరేసముద్రంలో మైలారప్ప ఇంటి ఆవరణలోని పాము పుట్ట

మడకశిర రూరల్: ఎక్కడైనా పాము పుట్ట ఉంటే అటుగా వెళ్లేందుకు ఎంతటి వారికైనా ఒక విధమైన జంకు ఏర్పడుతుంది. వాటికి దూరంగా నడుస్తుంటారు. అలాంటిది మడకశిర మండలం హరేసముద్రంగా బీసీ కాలనీలో నివాసముంటున్న మైలారప్ప.. ఏకంగా తన ఇంటి తలుపునకు ఆనుకుని 9 అడుగుల ఎత్తున్న పాము పుట్టతో కలసి జీవిస్తున్నాడు. 20 ఏళ్ల క్రితం చిన్నగా వెలసిన పుట్ట ప్రాంతంలో నివేశన స్థలాన్ని మైలారప్పకు ప్రభుత్వం మంజూరు చేసింది. పురోహితులను అడిగితే పుట్టను తొలగించరాదని, అంతా మంచే జరుగుతుందని చెప్పారు. దీంతో పుట్టను వదిలి ఇంటి నిర్మాణం పూర్తి చేసి గృహ ప్రవేశం చేశారు. అదే సమయంలో పుట్ట సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించారు. వర్షానికి పుట్ట తడిసిపోకుండా పైకప్పు రేకులు వేయించారు. చుట్టుపక్కల నివాసమున్న వారికి ఆ ప్రాంతంలో తరచూ నాగుపాము కనిపిస్తోంది. ఏనాడూ అది హాని తలపెట్టక పోవడంతో నాగదేవతగా గ్రామస్తులు భావించి నిత్య పూజలు చేసి, మొక్కులు తీర్చుకుంటున్నారు.

ఫాల్గుణం... విష్ణు ప్రీతికరం

మాసమంతా నృసింహుడి బ్రహ్మోత్సవాల సందడి



అనంతపురం నరసింహాలయంలో విశేష అలంకరణలో దర్శనమిస్తున్న శ్రీవారు



కళ్యాణదుర్గంలో వేపచెట్టులో వెలసిన నారసింహుడు

అనంతపురం కల్చరల్: ఫాల్గుణం విష్ణు ప్రీతికరం అంటోంది భాగవతం. ఇంతటి విశిష్టమైన ఫాల్గుణ మాసం ఈ నెల 21 నుంచి (మంగళవారం) నుంచి ప్రారంభం కానుంది. మాసాలలో ఫాల్గుణ మాసానికి ఓ ప్రత్యేకత ఉన్నట్లే.. దశావతారాల్లోనూ నృసింహావతారానికి అత్యంత విశిష్టత ఉంది. ఫాల్గుణ శుద్ధ పాడ్యమి నుంచి పన్నెండు రోజులు పయోవ్రతం ఆచరించి విష్ణుదేవుడికి క్షీరాన్నం నివేదిస్తే కోరికలు సిద్ధిస్తాయని భాగవత పురాణం చెబుతోంది. చైత్రాది మాసాల క్రమంలో చిట్ట చివరిది ఫాల్గుణ మాసం. ఇంతకు ముందున్న పదకొండు నెలల్లో చేసిన దేవతా పూజలు, వ్రతాలు ఈ చివరి మాసంలో మళ్లీ పునరావృతం కావడం విశేషం. ఫాల్గుణమాసం వచ్చిందంటే ప్రతి చోట శ్రీలక్ష్మీనారసింహస్వామి బ్రహ్మోత్సవాలు పెద్ద ఎత్తున జరుగుతాయి.

వేపచెట్టులో వెలసిన నారసింహుడు..

తాను సర్వాంతర్యామి అని ప్రకటించుకున్నట్టు జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో నరసింహస్వామి ఆలయాలు ప్రత్యేకతను చాటుతున్నాయి. కళ్యాణదుర్గంలోని కోట వద్ద వేపచెట్టులోనే సింహాకారం దాల్చిన రూపంలో లక్ష్మీనరసింహస్వామి నీరాజనాలందుకుంటున్నారు. పవిత్ర క్షేత్రమైన కదిరిలో హిరణ్యసంహారం చేస్తున్నట్టున్న విగ్రహం, పక్కనే ప్రహ్లాదరూపం ఉంటుంది. మార్చి 2న కదిరి బ్రహ్మోత్సవాలు ప్రారంభమై 16రోజుల పాటూ ఆధ్యాత్మిక భావజాలాన్ని వ్యాప్తి చేస్తాయి. రాక్షస వధ గావిస్తూ పెన్నహోబలిలంలో శ్రీవారు పాదం మోపాడని ప్రతీతి. కాబట్టే శ్రీవారి పాదమే ఇక్కడ విశేష పూజలందుకుంటోంది. ఆ కోవకు చెందినదే సుప్రసిద్ధ పంపనూరుకు సమీపంలో కొండపై వెలసిన మలహోబిల నరసింహస్వామి ఆలయం. రాయదుర్గం, ఉరవకొండ, శింగనమల తదితర ప్రాంతాల్లోనూ ఆదిదేవుడైన నరసింహుడు వివిధ రూపాలలో దర్శనమిస్తూ కోరిన కోర్కెలను నెరవేరుస్తూ భక్తకోటి ఇలవేల్పుగా పూజలు అందుకుంటున్నాడు. అనంతపురం పాతూరు వ్యాసరాజ మఠంలోని నరసింహ స్వామి ఆలయం.. నగరంలోనే ఏకైక ఆలయంగా ఖ్యాతిగడించింది.

సాక్షి → ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో



సాక్షి క్లాసిఫైడ్స్

AUTOMOBILES

SEZING CAR FOR SALE

■ Indusind బ్యాంక్ నందు మారుతి Ertiga VDI B.S. IV, మోడల్ 2020, Regd. No: AP 39 EB 1004 కారు అమ్మకానికి కలదు. 7032975347, 7032975900. [A-734026]

EDUCATION

FREE COACHING

■ ఉచిత శిక్షణ: అన్ని కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కు 2 నెలలు శిక్షణా తరగతులు నిర్వహించబడును. 26-2-2023 నుండి క్లాసులు ప్రారంభం, డైలీ 3 బ్యాచ్‌లు. (1) 12 to 2 PM (2) 2 to 4 PM (3) 4 to 6 PM. అడ్రస్: సాయి ఇనిస్టిట్యూట్, కమలానగర్, ATP. సెల్: 9059723829. [A-427]

ఉచిత శిక్షణతో ఉపాధి

■ గ్రామీణ నిరుద్యోగ యువతకు మూడు నెలల కాల వ్యవధిలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, కంప్యూటర్ హార్డ్‌వేర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ, భోజన వసతి సదుపాయం, అర్హతను బట్టి ఉపాధి అవకాశాలు. Nihar Skill Education, Kadapa. 7013665112, 9059160549. [C-1161876]

REAL ESTATE

PLOT FOR SALE

■ GMR COLONY, Alamuru Road, Anantapur. AHUDA approved open plots for sale. Cont: 9392183377, 9281024684, 9391756322. [A-418]

■ HIGHWAY COUNTY, Beside APS Warehousing Godowns, near SVIT, NH 44, AHUDA approved plots for sale. 9392183377, 9281024684, 9391756322. [A-419]

■ GREEN COUNTY, Rapthadu, NH 44, AHUDA approved open plots for sale. Cont: 9392183377, 9281024684, 9391756322. [A-417]

■ PLOT FOR SALE 7.2 Cents Near Shivalayam Lane, Chinmaya Nagar, Near JNTU College, Anantapur. Cont: 7386211565. [C-781392]

FOR SALE

■ CR HOMES 3BHK AHUDA Approved villas in premium gated community at Rachanapalli, Bellary Road, Anantapur. Celll : 9504811999, 9504812999 [A-425]

GODOWNS FOR LEASE / RENT

■ ATP, బళ్లారి రోడ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో, నవత ట్రాన్స్ పోర్ట్ దగ్గర, ప్లాటు నెం. C-3 లో 31x21 & 52x60 కొలతలు గల 2 గోడౌన్స్ లీజ్ / రెంట్‌కు కలవు. 9441190806, 9866117520. [A-734003]

HOUSE FOR SALE

■ అనంతపురం టౌన్ శిల్పా లేపాక్షి కాలనీ ప్రక్కన ఉన్న శ్రీకృష్ణా బృందావన్ కాలనీలో 3 సెంట్లలో గ్రౌండ్ ఫ్లోర్ 2 Bed రూమ్స్ 1st Floor నందు సింగిల్ బెడ్ రూమ్ West Facing గల ఇండిపెండెంట్ హౌస్ అమ్మబడును. No Brokers Only Genuine Persons. Contact No: 8978988404. [A-6050]

SERVICES

■ వ్యక్తిగత, వ్యాపారం, వ్యవసాయ ఆస్తి, టేకోవర్ లోన్, NPA కేసులు తక్కువ సిబిల్ స్కోర్ కూడా రుణానికి వర్తిస్తాయి. సంప్రదించండి: 9463846068. [T-1749]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521 [B-2282]

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్, బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టు వున్నవి, మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్ ట్రేడింగ్ కం. 73821 14647 [V-6077]

WANTED

■ టెలికాలర్స్ జాబ్స్ : ATP లో, మా ఆఫీస్ నందు వర్క్ చేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. Age: 35 సం॥లోపు. ఆసక్తిగల మహిళా అభ్యర్థులు సంప్ర॥ సెల్: 9160429288, 7997757059. [A-734022]

■ అతి తక్కువ పెట్టుబడితో కంపెని నుండి పంపించే పాత రికార్డ్స్ చూసి క్రొత్త రికార్డ్స్ వ్రాసినందుకు వారం వారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ : 8465843194 [G-387]

■ BOOK SHOP మరియు BOOKS మార్కెటింగ్ చేయుటకు Sales Executives కావలెను. నం॥ అనూ బుక్ సెంటర్, OPP: SRS Lodge, కమలానగర్, ATP. సెల్: 9440461355. [C-789364]

■ Marketing Executives, Receptionists with relevant experience for Real Estate Office at RACHANPALLI, Anantapur Susheela Reddy Constructions. 9504811999. [A-431]

■ స్పాట్ జాయినింగ్: ATP ప్రముఖ ఇండస్ట్రీలో ఆపరేటర్ కావలెను. (ట్రైనింగ్ ఇవ్వబడును). Q: 10th, ITI, డ్రైవింగ్ వచ్చినవారికి ప్రాధాన్యత. ఆకర్షణీయమైన జీతం. 8919562941. [A-426]

■ SAI JAYANI కార్పొరేట్ సర్వీస్ కంపెనీలో అనంతపురం జిల్లా అంతటా పనిచేయుటకు సూపర్‌వైజర్స్ & డెలివరీ బాయ్స్ కావలెను. సెల్ : 8297159036. [A-734025]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781842]

■ స్టార్ హోమ్ కేర్ Hyd. లో వృద్ధులకు, పేషంట్లకు సేవ చేయుటకు. బేబీకేర్, ఇంటి / వంట పనికి స్త్రీ / పు, లేడీ టెలీకాలర్స్ కావలెను. జీతం : 16,000/- నుండి 25,000/- రూం + భో. ఫ్రీ. ఫోన్ : 78010 99881, 86398 28228 [V-775156]

■ WALK IN INTERVIEW- Medical Representative Qualification : Any Graduation or D.Pharmacy 8919730457. [H-796710]

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!

అద్దెకు, అమ్మకం, రియల్ ఎస్టేట్, ఫర్నీచర్, ఆటోమొబైల్, కంప్యూటర్స్, సర్వీసెస్, కావలెను

4 లైన్లు రూ॥ 270/-
అదనపు లైను రూ॥ 60/-
(GST 5% అదనం)
ప్రతి 3 ప్రకటనలకు 1 ప్రకటన ఉచితం

ANANTHAPURAMU : 9010567770, 9492288307, 9010588846, 9243295650
DHARMAVARAM : 9912220726, 9912220727
HINDUPUR : 9912220723, 9705346587
GUNTAKAL : 9010223701
TADIPATRI : 9912220722
MADAKASIRA : 9010200238
KADIRI : 9010593486
RAYADURG : 9010470185

■ పెనుకొండలోగల ప్రముఖ FABRICATION Company లోకి Mechanical Engineer మరియు AUTOCAD Drawing Designer కావలెను. సంప్రదించవలసిన నం. 93989 13631. [A-424]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ, SRM బిల్డర్స్ ATP నందు జాబ్ చేయుటకు రిసెప్షనిస్ట్ (లేడీస్) మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అనుభవం గలవారికి ప్రాధాన్యత. 9347229535, 9989452444. [A-734027]

■ అనంతపురము మరియు బెంగుళూరు నందు జాబ్ చేయుటకు 10th to P.G. అర్హత కలిగిన యువతీ యువకులు అర్జెంటుగా కావలెను. సెల్ : 9121162341. [A-734028]

■ ATP, అరవిందనగర్ (విద్యుత్ నగర్ సర్కిల్ దగ్గరలో) టీ కేఫ్ నందు టీ / కాఫీ / బూస్ట్ / అల్లం పాలు etc... అనుభవం గల మాస్టర్ కావలెను. మంచి జీతం కలదు. సెల్: 93982 28709. [A-412]

■ ప్రముఖ బ్యాంకింగ్ కంపెనీ నందు పనిచేయుటకు యువతీ, యువకులు కావలెను. మార్కెటింగ్ అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. సంప్ర॥ సెల్: 8688107966, 9490464405. [A-2339]

■ Hydలో ప్రముఖ E-కామర్స్, ఫార్మా, MNC కంపెనీలకి హెల్పర్స్, ప్యాకర్స్, సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ గార్డ్స్, కేటరింగ్ బాయ్స్ కావలెను. రూం, భోజనం ఫ్రీ. జీతం: 15,000-30,000. Ph: 9121989324 [HA-10313]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీడ్రైవర్స్, లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు, వాచ్‌మెన్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-9790]

■ ప్రముఖ ప్రైవేట్ బ్యాంక్ మరియు ఫైనాన్స్ అండ్ చిట్‌ఫండ్ కంపెనీలో అకౌంటెంట్స్, సూపర్‌వైజర్స్, రికవరీ ఏజెంట్స్ కావలెను. జీతం: 22000/- ఆపైన, రూమ్+భోజనం ఫ్రీ. ఫోన్ : 9985784184 [H-778971]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తాపత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.